సాక్షి
అనంతపురం
సోమవారం । 31 । జూలై । 2023



తుంగభద్ర డ్యాంకు జలకళ

తుంగభద్ర డ్యాంలో ఆదివారం 72.357 టీఎంసీల నీరు నిల్వ చేరింది. వరద రూపంలో 70,600 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. నీటితో డ్యాం తొణికిసలాడుతోంది.



సీట్లకు ని'బంధనాలు'

టెన్త్ సప్లిమెంటరీలో మంచి మార్కులు వచ్చిన విద్యార్థులు నిబంధనల వల్ల గురుకులాల్లో ఇంటర్ సీట్లు పొందలేకపోతున్నారు. 8లో

గరిష్టం/కనిష్టం
34.2°/21.8°

జిల్లా అంతటా ఆదివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలివేగం పెరిగింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి జల్లులు పడ్డాయి.

న్యూస్‌రీల్

ప్రశాంతంగా బదిలీల కౌన్సెలింగ్



బదిలీ ఉత్తర్వులు అందజేస్తున్న ఏపీసీ సాయిరామ్

రాప్తాడురూరల్: ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని క్లస్టర్ రిసోర్స్ పర్సన్లు (సీఆర్పీ), ఎంఆర్‌సీల పరిధిలోని అకౌంటెంట్లు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, మెసెంజర్లు, ఆఫీస్ సబార్డినేటర్ల బదిలీల కౌన్సెలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఆదివారం సమగ్ర శిక్ష కార్యాలయంలో ఏపీసీ, జిల్లా విద్యాశాఖ అధికారి సమక్షంలో ఈ ప్రక్రియ సాగింది. రిక్వెస్ట్‌తో పాటు ప్రత్యేక కేటగిరీ కింద వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి సీనియార్టీ జాబితా తయారు చేశారు. వాటిపై అభ్యంతరాలు స్వీకరించి మార్పులు చేసి తుది జాబితాను వెల్లడించారు. ఆ తర్వాత కౌన్సెలింగ్ ద్వారా బదిలీలు చేపట్టారు. బదిలీ ఉత్తర్వులను ఏపీసీ సాయిరామ్ చేతుల మీదుగా అందజేశారు.

11 మంది ఎస్‌ఐల బదిలీ



అనంతపురం శ్రీకంఠంసర్కిల్: జిల్లాలో 11 మంది ఎస్‌ఐలు బదిలీ అయ్యారు. ఈ మేరకు ఎస్పీ కె.శ్రీనివాసరావు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. బుక్కరాయసముద్రం ఎస్‌ఐ వెంకటేశ్వర్లును అనంతపురం వన్‌టౌన్ ఎస్‌ఐగా బదిలీ చేశారు. అనంతపురం టూటౌన్ ఎస్‌ఐ డి.శ్రీనివాసులు బుక్కరాయసముద్రానికి, వన్‌టౌన్ ఎస్‌ఐ ఎస్.గౌస్ బాషా డీఎస్‌బీకు బదిలీ అయ్యారు. అనంతపురం వన్‌టౌన్ ఎస్‌ఐ ఎ.తిప్పయ్యను విడపనకల్లుకు బదిలీ చేశారు. వీఆర్‌లో ఉన్న ఎం.జావీద్‌బాషా అనంతపురం టూటౌన్‌కు, ఎస్‌ఐ ఆర్.రాఘువేంద్రరెడ్డి వీఆర్ నుంచి అనంతపురం టూటౌన్ ఎస్‌ఐగా బదిలీ అయ్యారు. అనంతపురం టూటౌన్ ఎస్‌ఐ ఎ.అల్లాబకాష్ డీఎస్‌బీకి, టూటౌన్ ఎస్‌ఐ కె.జయరాంనాయక్‌ను అనంతపురం ట్రాఫిక్‌కు బదిలీ చేశారు. యాడికి ఎస్‌ఐ గురుప్రసాద్‌రెడ్డికి అనంతపురం త్రీటౌన్ ఎస్‌ఐగా స్థానచలనం కలిగింది. అనంతపురం రూరల్ ఎస్‌ఐ బి.నబి రసూల్ యాడికి ఎస్‌ఐగా నియమితులయ్యారు. వీఆర్‌లో ఉన్న ఎ.అంజాద్ ఆలీని అనంతపురం వన్‌టౌన్ ఎస్‌ఐగా బదిలీ చేశారు.

జిల్లాస్థాయి సబ్ జూనియర్ జట్ల ఎంపిక పోటీలు



ఎంపిక పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

అనంతపురం: జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఆర్డీటీ స్టేడియంలో జిల్లాస్థాయి సబ్ జూనియర్ బాయ్స్, గర్ల్స్ జట్ల ఎంపిక పోటీలు నిర్వహించినట్లు జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, సెక్రటరీ మల్లేష్ తెలిపారు. మొత్తం 80 మంది ఫుట్‌బాల్ క్రీడాకారులు పాల్గొన్నారన్నారు. అనంతపురం టౌన్, ఆత్మకూరు, కళ్యాణదుర్గం, ఉరవకొండ, గుంతకల్లు, గుత్తి ఆర్.ఎస్, గుత్తి టౌన్, ఇసురాళ్లపల్లి ఫుట్‌బాల్ క్లబ్‌లలో ఉన్న క్రీడాకారులకు ప్రత్యేక శిక్షణ కల్పించినట్లు పేర్కొన్నారు. ఆగస్టులో జిల్లాస్థాయి సబ్ జూనియర్స్ పోటీలు నిర్వహిస్తామన్నారు.

అభాలో ఆరోగ్యం పదిలం

- ఇప్పటివరకూ 80 శాతం మందికి 'అభా' ఐడీలు
- వ్యక్తిగత ఆరోగ్య వివరాలు 'ఆయుష్మాన్ భారత్' ఐడీలో నిక్షిప్తం
- దేశంలో ఏ ప్రభుత్వ వైద్యుడి వద్దకు వెళ్లినా పాత చిట్టీలు అవసరం లేదు



అనంతపురం సర్వజనాస్పత్రిలో ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య కార్డు రిజిస్ట్రేషన్ చేస్తున్న సిబ్బంది (ఫైల్)

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఆరోగ్యరంగంలో వచ్చిన మార్పులు భవిష్యత్ తరాలకు గొప్ప ఫలితాలను ఇవ్వనున్నాయి. ముఖ్యంగా వెనుకబడిన అనంతపురం, శ్రీసత్యసాయి లాంటి జిల్లాల్లో పేదల జీవితాల్లో సానుకూల మార్పులకు అవకాశం ఏర్పడింది. జబ్బు చేసి ప్రైవేటు డాక్టర్ల వద్దకు వెళితే ఆస్తులమ్ముకునే పరిస్థితి నుంచి ప్రతి కుటుంబాన్నీ ఆరోగ్యపరంగా రక్షించుకునే ప్రభుత్వ యంత్రాంగం మనముందుకే వచ్చింది. ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, ప్రత్యేక యాప్‌లు ఇవన్నీ ఒకెత్తయితే.. ప్రతి ఒక్కరి ఆరోగ్య చరిత్రను ఎప్పటికప్పుడు పర్యవేక్షించే అభా (ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్) ఐడీలను సృష్టించడం మరో ఎత్తు.

మొబైల్‌లోనే చూసుకునే అవకాశం..

ఇది వరకు ప్రభుత్వాస్పత్రిలో డాక్టర్ వద్ద చూపించుకున్న సమయంలో చేసిన వైద్య పరీక్షలకు సంబంధించిన వివరాలు చిట్టీలో పొందుపరిచేవారు. మరోసారి ఎప్పుడైనా వైద్యం కోసం వచ్చినపుడు పాత చిట్టీ (ప్రిస్క్రిప్షన్) లేకపోతే సదరు పరీక్షలు మళ్లీ చేయాల్సి వచ్చేది. ఇప్పుడు అభా (ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్) ఐడీ సృష్టిస్తే మునుపటిలా ఉండదు. ఎప్పుడు వైద్యపరీక్షలు చేసినా, డాక్టరు మందులు రాసినా, జబ్బు వివరాలు, తీవ్రత, వాడిన మందుల గురించి మనకు ఇచ్చిన 14 అంకెల హెల్త్ ఐడీలో పొందుపరుస్తారు. అభా పేరుతో ఉండే ఈ ఐడీని ఒక్కసారి కంప్యూటర్/మొబైల్‌లో క్లిక్ చేస్తే చాలు మన ఆరోగ్యం పుట్టుపూర్వోత్తరాలు వెంటనే కనిపిస్తాయి. వీటి ఆధారంగా మనకు తదుపరి నాణ్యమైన వైద్యం ఎలా అందించాలో తెలుసుకునే వెసులుబాటు ఉంటుంది. ఇలా రెండు జిల్లాల్లో ఇప్పటివరకు 80 శాతం మందిని స్క్రీన్ చేసి హెల్త్ ఐడీలు పూర్తి చేశారు. మిగతా వారికి త్వరలోనే పూర్తి చేయనున్నారు.

మనమే డౌన్‌లోడ్ చేసుకోవచ్చు..

- అభా అని గూగుల్‌లో క్లిక్ చేస్తే వెబ్‌సైట్ లింక్ వస్తుంది. దీన్ని క్లిక్ చేసి మన ఆధార్ నంబరు టైప్ చేసి సబ్‌మిట్ చేయాలి.
- అప్లికేషన్‌లో మొబైల్ నంబర్ యాడ్ చేయగానే ఓటీపీ వస్తుంది. ఓటీపీ ఎంటర్ చేసి వివరాలు నమోదు చేయాలి.
- ప్రతి స్టేజీలోనూ వివరాలు నమోదు చేస్తూ చివరగా ఫొటోను అప్‌లోడ్ చేయాలి.
- ఫొటోను అప్‌లోడ్ చేశాక మనకు పాన్‌కార్డ్ తరహాలో ఐడీ కార్డు వస్తుంది. దీన్ని డౌన్‌లోడ్ చేసుకుని ల్యామినేషన చేసుకోవడమే.

అనంతపురం జిల్లాలో	
మొత్తం జనాభా	22,69,373
ఇప్పటివరకూ హెల్త్ ఐడీలు	17,20,490
ఇంకా చేయాల్సిన ఐడీలు	5,48,883
శ్రీసత్యసాయి జిల్లాలో..	
మొత్తం జనాభా	18,59,908
ఇప్పటివరకూ హెల్త్ ఐడీలు	14,20,334
ఇంకా చేయాల్సిన ఐడీలు	4,39,574

'అభా'తో నాణ్యమైన వైద్యం



ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్‌లో భాగంగా ఈ హాస్పిటల్ విధానాన్ని ప్రభుత్వం అమలు చేయనుంది. వివిధ ఆస్పత్రుల్లో అభా కార్డు ఎన్‌రోల్ చేసే విధంగా ఇప్పటికే చర్యలకు ఉపక్రమించాం. ప్రతి ఒక్కరికి ఒక ఐడీ వస్తుందని, ఆ గుర్తింపు నంబర్‌లో రోగి చరిత్ర (పేషంట్ హిస్టరీ) సంక్షిప్తంగా ఉంటుంది. దేశంలో ఏ ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య సేవలు పొందాలనుకున్నా.. అభా ఐడీని ఓపెన్ చేస్తే రోగి వివరాలు తెలుస్తాయి. రోగులు వారి నివేదికలను తీసుకెళ్లాల్సిన పని ఉండదు. నాణ్యమైన వైద్యం లభిస్తుంది. ప్రతి ఒక్కరూ అభా కార్డు పొందాలి.
– డాక్టర్ యుగంధర్, డీఎంహెచ్‌ఓ



అభా కార్డుతో ఉపయోగాలేమిటి..?

- అభా అంటే ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డ్ లేదా అకౌంట్.
- 14 అంకెలతో క్రియేట్ చేసే ఒక డిజిటల్ ఐడెంటిటీ.
- ఏటీఎం లాగే ఇది కూడా ఒక ఆరోగ్య ఐడీ కార్డులాగా ఉంటుంది.
- మనం ఎప్పుడైనా, ఎక్కడైనా డాక్టరు వద్దకు వెళితే ఈ 14 అంకెల నంబరు చెప్పగానే మన ఆరోగ్య వివరాలన్నీ ఇందులో నమోదు చేస్తారు.
- ప్రతిసారీ పాత రిపోర్టులు అక్కర్లేదు. రెండేళ్ల తర్వాత ఇంకో డాక్టరు వద్దకు వెళ్లినా ఈ ఐడీ ద్వారా మీ ఆరోగ్య పూర్వాపరాలు తెలుసుకుని మీకు చికిత్స చేయవచ్చు.
- మన ఐడీలో మనకు చికిత్స వివరాలతో పాటు డాక్టరు పేరు, డాక్టరు గుర్తింపు నంబరు, రాసిన మందులు, స్కానింగ్‌లు అన్నీ ఉంటాయి.
- దేశవ్యాప్తంగా ఎక్కడికి వెళ్లి వైద్యం చేయించుకున్నా ఈ వివరాలు ఉంటాయి.
- అభా కార్డు ఉంటే రూ.5 లక్షల వరకు ఆరోగ్య బీమా వర్తిస్తుంది. ఇప్పుడు మన రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ కూడా రూ.5 లక్షల బీమా ఇస్తున్న సంగతి తెలిసిందే.



భర్తపై వేడినీళ్లు పోసిన భార్య

గుత్తి: కోపంతో భర్తపై వేడినీళ్లు పోసిన భార్య ఉదంతం గుత్తిలో జరిగింది. చెట్నేపల్లికి చెందిన కానిస్టేబుల్ శివ, ఇందు దంపతులు. ఆదివారం కుటుంబంలో చిన్నపాటి సమస్యపై దంపతులు గొడవపడ్డారు. అనంతరం మంచంపై పడుకుని ఉన్న భర్తపై కోపంతో రగిలిపోయిన భార్య వేడినీళ్లు తీసుకొచ్చి పోసింది. ఛాతీ, కాళ్లపై వేడినీళ్లు పడటంతో గాయపడ్డ శివను తొలుత ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కొద్దిసేపటికే అక్కడి నుంచి గుత్తిలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్యం చేయించారు. అయితే ఈ ఘటనకు సంబంధించి పోలీసులకు ఎటువంటి సమాచారమూ అందలేదు.

ప్రారంభానికి సిద్ధంగా చీనీ మార్కెట్ ఓపెన్ షెడ్



చీనీ మార్కెట్‌లో కొత్తగా నిర్మించిన ఓపెన్‌షెడ్

అనంతపురం అగ్రికల్చర్: దేశంలోనే అతిపెద్ద చీనీ మార్కెట్లలో ఒకటిగా పేరుగాంచిన అనంతపురం మార్కెట్‌లో మరిన్ని మౌలిక వసతుల కల్పనపై రాష్ట్ర ప్రభుత్వం, మార్కెటింగ్‌శాఖ దృష్టి సారించింది. ఏడాది పొడవునా చీనీ క్రయవిక్రయాలు సాగించే ఏకైక మార్కెట్ ఇదే కావడం గమనార్హం. అనంతపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రాంగణంలో ఉన్న చీనీ మార్కెట్‌లో ఇప్పటికే ఓపెన్ షెడ్ ఉండగా తాజాగా ఆధునాతన పద్ధతిలో మరో ఓపెన్ షెడ్ నిర్మాణం తుది దశకు చేరుకుంది. దీని నిర్మాణానికి రూ.2.10 కోట్లు వెచ్చించారు. ఇక్కడ ఏటా 70 వేల నుంచి 90 వేల మెట్రిక్ టన్నుల అమ్మకాలు జరుగుతున్నాయి. ఓపెన్‌షెడ్డు అందుబాటులోకి వస్తే అమ్మకాలు మరింత ఎక్కువ జరిగే పరిస్థితి నెలకొంది. వేసవిలో అధిక ఉష్ణోగ్రతలు, వర్షాకాలంలో వానలు కురిసినపుడు ఎదురవుతున్న ఇబ్బందులకు ఈ ఓపెన్‌షెడ్‌తో చాలా వరకు పరిష్కారం దక్కుతుంది. త్వరలో ఈ షెడ్‌ను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు యార్డు చైర్మన్ ఫయాజ్, ఉన్నతశ్రేణి కార్యదర్శి ఆర్.జయలక్ష్మి తెలిపారు.

రాయల్టీ నిధులు.. అభివృద్ధి పరుగులు

- జిల్లాలో ఖనిజాల రాయల్టీ ద్వారా రూ.98.46 కోట్ల ఆదాయం
- మైనింగ్ ప్రభావిత గ్రామాల్లో అభివృద్ధి పనులకు వ్యయం
- 1,409 పనులకు గాను 722 పూర్తి





పెద్దపప్పూరులో సచివాలయం-1 వద్ద నుంచి రూ.2 కోట్ల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: అనంతపురం జిల్లా అంటేనే ఖనిజాల ఖిల్లా. ఇప్పటికే సున్నపురాయి పుష్కలంగా ఉండటంతో సిమెంటు ఫ్యాక్టరీలు వెలిశాయి. దీనికి తోడు రోడ్డు మెటల్, గ్రావెల్ వంటి ఖనిజాలు నుంచి వచ్చే 'రాయల్టీ' అంటే పన్నుల తరహా వచ్చే నిధులూ ఉన్నాయి. డీఎంఎఫ్ (డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్) పేరుతో వచ్చే నిధులతో మైనింగ్ ప్రభావిత గ్రామాల్లో అభివృద్ధి చేపట్టారు. రోడ్లు, తాగునీటి సౌకర్యం లేని పలు గ్రామాలకు ఈ నిధులు ఇతోధికంగా ఉపయోగపడ్డాయి.

డీఎంఎఫ్ వసూళ్లు రూ.98 కోట్ల పైనే..

జిల్లాలో ఖనిజాల రాయల్టీ ద్వారా రూ.98.46 కోట్లు వచ్చింది. వీటితో సుమారు 1,409 పనులు చేపట్టారు. రోడ్లు, డ్రెయినేజీ, తాగునీటి సౌకర్యం, చిన్న చిన్న బ్రిడ్జిలు, గ్రామాల్లో రాకపోకలకు అవసరమయ్యే కల్వర్టులు చేపట్టారు. కొన్ని గ్రామాల్లో అయితే ఇప్పటికీ చేతిపంపులు, బోర్ల నుంచి నీళ్లు తెచ్చుకునే వారు ఉన్నారు. ఖనిజాల నుంచి రాయల్టీ రూపంలో వచ్చిన సొమ్ముతో అలాంటి గ్రామాల్లో పైపులైన్లు – బోర్లు వేసి ఇంటింటికీ నీటి సౌకర్యం కల్పించారు. ఇప్పటి వరకు మొత్తం 722 పనులు పూర్తవగా.. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి.

తాగునీటికే పెద్దపీట..

ఖనిజాల నుంచి వచ్చే రాయల్టీ నిధులు ఎక్కువగా తాగునీటి కోసమే ఖర్చు చేస్తున్నారు. పంచాయతీరాజ్ విభాగంలో 423 పనులు అంచనా వేయగా.. ఇప్పటి వరకు 56 పనులు పూర్తి చేసి, రూ.6.26 కోట్లు వ్యయం చేశారు. రూరల్ వాటర్ సప్లై విభాగం కింద 227 పనులను గుర్తించగా అందులో 102 పనులు పూర్తయ్యాయి. దీని కోసం రూ.4.74 కోట్లు వ్యయం చేశారు. అనంతపురం సర్వజనాస్పత్రిలో 29 పనులను గుర్తించి ఇప్పటివరకు 19 పనులు పూర్తి చేశారు. దీనికోసం రూ.1.89 కోట్లు ఖర్చు చేశారు.

నియోజకవర్గాల వారీగా రాయల్టీ కింద వచ్చిన నిధులు.. చేపట్టిన పనులు

నియోజకవర్గం	డీఎంఎఫ్ నిధులు (రూ.లక్షల్లో)	పనులు	పూర్తయినవి	వ్యయం (రూ.లక్షల్లో)
గుంతకల్లు	332.49	220	54	24.75
కళ్యాణదుర్గం	109.47	119	72	33.95
రాప్తాడు	300.55	214	191	87.68
రాయదుర్గం	1075.07	214	120	83.65
శింగనమల	146.10	149	71	26.45
తాడిపత్రి	7492.78	224	113	938.26
ఉరవకొండ	89.79	234	79	39.40
అనంతపురం	1.97	35	22	310.51

(ఇతర విభాగాల నుంచి రాయల్టీ రూపంలో వచ్చినది రూ.297.95 లక్షలు)

మైనింగ్ ప్రభావిత గ్రామాల్లో అభివృద్ధి పనులు

జిల్లాలోని మైనింగ్ ప్రభావిత గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం జిల్లా ఖనిజాభివృద్ధి నిధులను ఖర్చు చేస్తున్నాం. ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలను కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. అందులో భాగంగానే మైనింగ్ ప్రభావిత ప్రాంతాల్లో తాగునీరు, సీసీ రోడ్లు, వీధిలైట్లతోపాటు పాఠశాలల అభివద్ధి కోసం ఎక్కువ శాతం నిధులను ఆయా శాఖల అధికారులతో కలిసి పనులు చేపట్టాం.
– నాగయ్య, ఇన్‌చార్జ్ డిప్యూటీ డైరెక్టర్, గనులు, భూగర్భ శాఖ

మొహర్రం వేడుకల్లో అలజడి

- కంబదూరు, బ్రహ్మసముద్రంలో ఘర్షణలు



కంబదూరులో కొడవలితో వీరంగం సృష్టిస్తున్న ఓ యువకుడు

కంబదూరు/బ్రహ్మసముద్రం: మొహర్రం వేడుకల్లో రెండు చోట్ల అలజడి రేగింది. ఒక చోట మద్యం మత్తులో యువకులు మారణాయుధాలతో వీరంగం సృష్టించగా.. మరొకచోట పెత్తందారులు ఎస్సీలపై దాడులకు పాల్పడ్డారు. వివరాలిలా ఉన్నాయి. హిందూ, ముస్లింలు కలసిమెలసి జరుపుకొనే పండుగ మొహర్రం. ఇందులో భాగంగా కంబదూరు మండల కేంద్రంలో సెబ్ స్టేషన్ ఎదురుగా పీర్లచావిడి వద్ద శనివారం రాత్రి పెద్ద సరిగెత్తు నిర్వహించారు. ఇదే సమయంలో కంబదూరుకు చెందిన ఎరికల ముత్యాలు, రాజశేఖర్, వేపకుంటకు చెందిన అనిల్, సాయికుమార్, గోపాల్ అనే ఐదుగురు యువకులు మద్యం మత్తులో మారణాయుధాలతో చొచ్చుకొచ్చి ఆధిపత్యం కోసం వీరంగం వేశారు. వారిని అడ్డుకునే ప్రయత్నం చేసిన కొంతమందిపై కొడవళ్లతో దాడి చేశారు. ఈ దాడిలో కంబదూరుకు చెందిన వన్నూర్ బాషా, నూర్‌బాషా, సుబాన్, సాదిక్ గాయపడ్డారు. దీంతో ఒక్కసారిగా స్థానికులు తిరగబడ్డారు. అందరూ ఏకమై వారిని తరుముతూ పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. డీఎస్పీ బి.శ్రీనివాసులు, సీఐలు శ్రీనివాసులు, తేజోమూర్తి, ఎస్‌ఐలు రాజేష్, యువరాజు, నాగమధు, కృష్ణమూర్తి, స్పెషల్ పార్టీ సిబ్బంది రంగప్రవేశం చేసి పరిస్థితిని చక్కదిద్దారు. ఐదుగురు యువకులపై కేసు నమోదు చేశారు.

పీర్ల చావిడి వద్ద ఘర్షణ..

బ్రహ్మసముద్రం మండల కేంద్రంలో శనివారం రాత్రి పీర్ల చావిడి వద్ద ఇరు వర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. మొహర్రం వేడుకల్లో ఎస్సీ కాలనీకి చెందిన చంద్రన్న, నుంకన్న అనే యువకులతో పెత్తందారులు గొడవ పడ్డారు. 'తక్కువ కులానికి చెందిన మీరు తప్పెట్లు వాయించాలి. అంతేగానీ మీరు మాతో సమానంగా పండుగ సంబరం చేయకూడదు' అంటూ అవమానించారు. అంతటితో ఆగక కులం పేరుతో దూషించి ఇద్దరు యువకులను చితకబాదారు. బాధితులు ఆదివారం ఉదయం, సాయంత్రం రెండు దఫాలు పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళన చేశారు. దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కళ్యాణదుర్గంలో కట్టెలు, రాళ్లతో దాడులు

కళ్యాణదుర్గం: పట్టణంలో ఆదివారం సాయంత్రం పీర్ల జలధి కార్యక్రమంలో రెండు వర్గాల మధ్య గొడవ జరిగింది. మద్యం మత్తులో ఉన్న ఇరు వర్గాలు పరస్పరం కట్టెలు, రాళ్లతో దాడులు చేసుకున్నారు. పలువురు గాయపడ్డారు. ఇరువర్గాలను చెదరగొట్టే సమయంలో హోంగార్డు సుధాకర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న డీఎస్పీ బి.శ్రీనివాసులు పోలీసు సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. అనంతరం పోలీసు బందోబస్తు నడుమ పీర్లను జలధికి తరలించారు.

టాప్ లేపిన టమాట ధర



ఈ రైతు పేరు తిమ్మారెడ్డి. కంబదూరు మండలం ఒంటారెడ్డిపల్లి గ్రామం. ఏటా నాలుగైదు ఎకరాల్లో టమాట వేసినా పెద్దగా లాభం రాలేదు. ఈసారి రూ.2లక్షల పెట్టుబడితో రెండు ఎకరాల విస్తీర్ణంలో టమాట సాగు చేశాడు. కనీవినీ ఎరుగని రీతిలో పంట ఆదాయం తెచ్చి పెట్టింది. గత వారం మొదటి కటింగ్ కింద బాక్సు రూ.1,700 ప్రకారం 40 బాక్సులు విక్రయించగా.. ఆదివారం తీసుకు వచ్చిన 80 బాక్సులు రికార్డు స్థాయిలో రూ.2,300 ప్రకారం అమ్ముడుబోయాయి. కేవలం ఈ రెండు కోతల్లోనే ఆయనకు పెట్టుబడి పోయి లాభాల్లోకి వచ్చేశారు. ఇంకా రెండు వేల బాక్సులకు పైగా దిగుబడి రావచ్చని, రూ.లక్షల్లోనే ఆదాయం సమకూరుతుందని చెబుతున్నాడు.

- మార్కెట్‌లో ధరలు మరింత పైపైకి
- కక్కలపల్లి మండీలో 15 కిలోల బాక్సు రూ.2,300
- సరుకు తక్కువగా రావడంతో వేలంలో పోటాపోటీ



మండీలో ఆదివారం టమాట వేలం పాట

అనంతపురం అగ్రికల్చర్: టమాట ధరలు రాకెట్‌లా దూసుకుపోతున్నాయి. నెల రోజులుగా గరిష్ట ధరలతో హోరెత్తిస్తున్న టమాట... ఆదివారం మరింత తారెత్తించింది. అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లి మండీలో 15 కిలోల టమాటాల బాక్సు రూ.2,300 పలికి రికార్డు సృష్టించింది. అంటే కిలో రూ.153 ప్రకారం హాట్‌కేక్‌లా అమ్ముడుబోయింది. నెల రోజులుగా కిలో రూ.100 తగ్గకుండా క్రయవిక్రయాలు జరుగుతున్నాయి. దీంతో బహిరంగ మార్కెట్‌లో వినియోగదారులు టమాట కొనుగోలు చేయలేని పరిస్థితి నెలకొంది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు కొంత వెసులుబాటు కలిగేలా రైతుబజార్లలో కిలో రూ.50 ప్రకారం ప్రత్యేక కౌంటర్ల ద్వారా అందిస్తోంది. అనంతపురం రైతు బజార్‌లో రోజుమార్చి రోజు ప్రత్యేక కౌంటర్ నిర్వహిస్తున్నారు.

ప్రస్తుతం టమాట పంట కోతకు వచ్చిన రైతులకు జాక్‌పాట్ తగిలినట్టుగా భారీగా ఆదాయం వస్తోంది. గత కొన్నేళ్లుగా సాగు చేస్తూ ఈసారి సాగు చేయని రైతుల్లో అంతులేని బాధ మిగిల్చింది. నెల రోజులుగా తమ మండీలో గరిష్ట ధర కిలో రూ.120 తగ్గకుండా పలుకుతోందని నిర్వాహకుడు రమణ 'సాక్షి'కి తెలిపారు.

డిమాండ్‌కు తగ్గ సరుకు లేకే..

అనంతపురం జిల్లాలో మూడు వేల ఎకరాలు, శ్రీసత్యసాయి జిల్లా పరిధిలో రెండు వేల ఎకరాల వరకు టమాట సాగులో ఉన్నా కోతకు వచ్చింది చాలా తక్కువేనని ఉద్యానశాఖ అధికారి జి.చంద్రశేఖర్ తెలిపారు. గతేడాది పెద్దగా ధరలు దక్కకపోవడం, అలాగే మార్చి, ఏప్రిల్, మే నెలల్లో సాగుకు అనుకూలంగా లేనందున చాలా మంది రైతులు టమాట వేయలేకపోయారన్నారు. 2022 జనవరిలో 15 కిలోల బాక్సు గరిష్టంగా రూ.600, ఫిబ్రవరి రూ.250, మార్చిలో రూ.100, ఏప్రిల్‌లో 200, మేలో రూ.400, జూన్‌లో రూ.700 ప్రకారం పలికిందని గుర్తు చేశారు. అధిక వర్షాలు, అకాల వర్షాలు, అధిక ఉష్ణోగ్రతలు లాంటి ప్రతికూల పరిస్థితులు ఉన్నందున ఈసారి టమాట సాగుకు రైతులు కాస్త వెనకడుగు వేయడంతో.. సరుకు తక్కువై ధరలు మోతెక్కిస్తున్నట్లు విశ్లేషించారు.

క్లుప్తంగా

గుత్తి రైల్వే డీజిల్ షెడ్‌లో డీఆర్ఎం తనిఖీలు

గుత్తి: స్థానిక రైల్వే డీజిల్ షెడ్‌ను ఆదివారం గుంతకల్లు డీఆర్ఎం మనీష్ అగర్వాల్ తనిఖీ చేశారు. అన్ని విభాగాలను పరిశీలించారు. రైల్వే ఉద్యోగులు, కార్మికులతో ముచ్చటించారు. మొక్కలు నాటి, నీరుపోశారు. విధులు బాధ్యతగా నిర్వర్తించాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ డీఎంఈ రమేష్, పలువురు రైల్వే అధికారులు, కార్మికులు పాల్గొన్నారు.

వ్యాపారి దుర్మరణం


గోపాల్ (ఫైల్)

యాడికి: ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడిన ఘటనలో ఓ వ్యాపారి దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... అనంతపురానికి చెందిన గోపాల్ (52) రైతుల పండించిన బొప్పాయిని కొనుగోలు చేసి, అనంతపురంలోని మార్కెట్ యార్డుకు తరలించి సొమ్ము చేసుకునేవాడు. ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు యాడికి మండలం వెంగన్నపల్లిలో రైతు బయపురెడ్డి తోటలో బొప్పాయి కొనుగోలుకు తన ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. మార్గ మధ్యంలో పుప్పాల దాటిన తర్వాత వేగాన్ని నియంత్రించుకోలేక అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న పల్లంలోకి వాహనంతో పాటు దూసుకెళ్లాడు. ఘటనలో కిందపడి తీవ్రంగా గాయపడిన గోపాల్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమీప రైతుల నుంచి సమాచారం అందుకున్న ఎస్ఐ గురుప్రసాదరెడ్డి అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడికి భార్య సుభద్ర, ఇద్దరు కుమారులు ఉన్నారు. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

తమ్ముడు అనుకుని అన్నపై దాడి

పెనుకొండ రూరల్: రెండు వర్గాల మధ్య వివాదం చోటు చేసుకుని తమ్ముడు అనుకుని అన్నపై దాడి చేసిన ఘటన పెనుకొండ మండలం మునిమడుగులో చోటు చేసుకుంది. వివరాలు.. మునిమడుగుకు చెందిన వైకే గోవిందప్ప, కదిరప్ప అన్నదమ్ములు. ఆదివారం సాయంత్రం పీర్ల వద్ద తప్పెట కొట్టేందుకు కదిరప్ప వెళ్లాడు. ఆ సమయంలో మద్యం మత్తులో కొందరు తమ ఎదుట తప్పెట కొట్టాలని కదిరప్పను ఒత్తిడి చేశారు. అయితే కాస్త పక్కకు వస్తే తప్పెట కొడతానని పేర్కొనడంతో తమ మాటకే ఎదురు చెబుతావా? అంటూ కదిరప్పను కొట్టారు. దీంతో మనస్తాపం చెందిన కదిరప్ప తప్పెట తీసుకుని అక్కడి నుంచి వెళ్లిపోయాడు. ఈ అంశాన్ని అవమానంగా భావించిన వారు ఫుల్‌గా మద్యం సేవించి నేరుగా కదిరప్ప ఇంటి వద్దకు చేరుకున్నారు. ఆ సమయంలో ఇంట్లో కదిరప్ప లేడు. భోజనం చేస్తున్న గోవిందప్పనే కదిరప్ప అనుకుని చితకబాదారు. అడ్డుకోబోయిన గోవిందప్ప భార్యను సైతం కొట్టి, కులం పేరుతో దూషించారు. దాడికి పాల్పడిన బోయ గణేష్, నాగార్జున, బోయ శీన, రామసుబ్బయ్య.తదితరులపై కియా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు.

సీట్లకు ని'బంధనాలు'

- ఏపీ గురుకులాల్లో ఏటా మిగులుతున్న సీట్లు
- సప్లిమెంటరీలో మంచి మార్కులు వచ్చినా దక్కని సీటు
- పేద పిల్లల చదువులకు ప్రతిబంధకంగా మారిన నిబంధనలు



బ్రహ్మసముద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల

కళ్యాణదుర్గం: నిరుపేద విద్యార్థులకు ఉచితంగా ఉన్నత విద్యను అందించాలన్న ప్రభుత్వ సంకల్పానికి ఏపీ గురుకుల సొసైటీల్లో ఆటంకాలు కలుగుతున్నాయి. సొసైటీ అధికారుల అనాలోచిత నిర్ణయాలే ఇందుకు కారణంగా విమర్శలు వెల్లువెత్తాయి. ఏపీ గురుకుల సొసైటీలు స్థాపించిన కొత్తలో ఏర్పాటు చేసుకున్న నిబంధనలు నేటికీ కొనసాగిస్తుండడంతో పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య చేరువ కాకుండా పోతోంది. ఫలితంగా ప్రతి ఏటా ఇంటర్మీడియట్‌లో సీట్లు మిగులుతున్నాయి.

సడలించని నిబంధనలు..

పేదలకు ఉన్నత విద్యను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అమ్మఒడి, జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన, విదేశీ విద్య లాంటి పథకాలతో ప్రోత్సహిస్తోంది. అయితే ఏపీ గురుకుల సొసైటీలు మాత్రం ఇందుకు అతీతంగా వ్యవహరిస్తున్నాయి. పాత కాలం నాటి నిబంధనలు కొనసాగిస్తూ ఇంటర్‌లో అడ్మిషన్లు కల్పిస్తుండడంతో చాలా మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులకు సీట్లు దక్కడం లేదు. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా నిబంధనలు సడలించాలని పలువురు కోరుతున్నారు.

సప్లిమెంటరీలో మంచి మార్కులు వచ్చినా..

గత విద్యాసంవత్సంలో జిల్లా వ్యాప్తంగా 12,349 మంది విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్షలు రాశారు. ఇందులో 7,403 మంది ఉత్తీర్ణత సాధించారు. ఇందులో 3,272 మంది బాలికలు, 7,403 మంది బాలురు ఉన్నారు. వీరిలో ఎస్సీలు, ఎస్టీలు, బీసీలు, మైనారిటీ విద్యార్థులే ఎక్కువగా ఉన్నారు. వీరంతా రెగ్యులర్ ఫలితాల్లో ఐదు మార్కుల్లో ఫెయిల్ అయి సప్లిమెంటరీలో మంచి మార్కులు తెచ్చుకున్నవారే కావడం గమనార్హం. అయితే వీరంతా ఏపీ గురుకుల కళాశాలల్లో ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరేందుకు అనర్హులు. ఈ మేరకు గురుకులాల సొసైటీ నిబంధనలు చెబుతున్నాయి.

ఖాళీగానే ఉంచుతాం తప్ప భర్తీ చేయం!

ఇప్పటి వరకూ ఏపీ గురుకుల కళాశాలల్లో సీట్లను రెగ్యులర్‌గా ఉత్తీర్ణత సాధించి, సొసైటీ నిబంధనలకు లోబడి మార్కులు సాధించిన వారికి మాత్రమే కేటాయిస్తూ వచ్చారు. మిగులు సీట్లను ఖాళీగానే ఉంచుతాం కానీ సప్లిమెంటర్‌లో ఉత్తీర్ణులైన వారికి కేటాయించబోమనే ధోరణిని అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఈ ఏడాది సైతం ఇప్పటికీ ఇంటర్ మొదటి సంవత్సరంలో చాలా సీట్లు ఖాళీగానే ఉన్నాయి.

నేటితో గడువు పూర్తి..

ఉమ్మడి అనంతపురం జిల్లాలోని ఉరవకొండ, బ్రహ్మసముద్రం, కురుగుంట, నల్లమాడ బాలికల గురుకుల పాఠశాలల్లో ఎంఈసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూపుల్లో 130కు పైగా సీట్లు ఖాళీగా ఉన్నట్లు అధికారిక సమాచారం. ఈ వివరాలను ఈ నెల 11న గురుకుల పాఠశాలల సొసైటీ కార్యదర్శికి జిల్లా కో ఆర్డినేటర్ పంపారు. ముఖ్యంగా ఆర్ట్స్ గ్రూపుల్లో చేరేందుకు బాలికలు ఆసక్తి చూపడం లేదన్న అంశాన్ని సైతం ఉన్నతాధికారులకు నివేదించారు. మిగులు సీట్లలో ఆసక్తి చూపుతున్న వారికి అవకాశం కల్పించేలా చర్యలు తీసుకోవడంలో సొసైటీ అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఈ నెల 31వ తేదీతో అడ్మిషన్ల గడువు ముగుస్తుంది. మిగులు సీట్లు అలాగే వదిలేస్తారా? లేదా ఆసక్తి కనబరుస్తున్న విద్యార్థులతో భర్తీ చేస్తారా? అనేది తేలాల్సి ఉంది.

కిడ్నాప్ ఛేదింపునకు ప్రత్యేక బృందాలు

- అనంతకు చేరుకున్న కర్ణాటక పోలీసులు
- కిడ్నాపర్ల కోసం జల్లెడ పడుతున్న అనంత పోలీసులు


బాధితులతో ఆరా తీస్తున్న సీఐలు ప్రతాప్‌రెడ్డి, ధరణీకిషోర్ (ఫైల్)

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: జిల్లా కేంద్రంలో కర్ణాటక ప్రాంత వ్యక్తి కిడ్నాప్ కేసును ఛేదించేందుకు పోలీసులు తలమునకలయ్యారు. బాధితులు ఇచ్చిన సమాచారం మినహా.. కిడ్నాప్‌కు గురైన గ్రామ పంచాయతీ వార్డు సభ్యుడు లలీంద్ర ఎక్కడున్నదీ ఇంత వరకూ పసిగట్టలేకపోయారు. దీంతో ఈ కేసును ఎస్పీ కె.శ్రీనివాసరావు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. అసలు మిస్టరీని ఛేదించేందుకు రంగంలో మూడు ప్రత్యేక బృందాలను దించారు. కిడ్నాప్‌కు గురైన లలీంద్రతోనే వారు తిరిగి రావాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడంతో ఓ బృందం కర్ణాటకలోని రాయచూరుకు చేరుకుని అక్కడి నుంచి దర్యాప్తు చేపట్టింది. మరో బృందం కర్నూలు జిల్లాను జల్లెడ పడుతోంది. బాధిత వర్గంలోని ఏడుగురిని వెంటబెట్టుకుని మూడో బృందం మిగిలిన రెండు బృందాలను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతోంది.

కిడ్నాప్ చేయించలేదని చెప్పించే కుట్ర..

మరో రెండు రోజుల్లో కర్ణాటకలో సర్పంచ్, ఉప సర్పంచ్ ఎన్నికల జరగాల్సి ఉన్న నేపథ్యంలో అనంతపురంలోని శిబిరంలో ఆశ్రయం పొందుతున్న లలీంద్రను వ్యూహాత్మకంగా కిడ్నాప్ చేసినట్లు తెలుస్తోంది. ఇది కాస్త వివాదస్పదం కావడంతో లలీంద్రను ఎలాగైనా తమ దారికి తెచ్చుకుని ఇది కిడ్నాప్ కాదని పోలీసులు ఎదుట చెప్పించేందుకు కుట్ర పన్నినట్లు తెలిసింది. ఈ విషయంగా అనంత పోలీసులతో రాయబారం నడిపేందుకు కర్ణాటక పోలీసులను ఓ ప్రధాన రాజకీయ పార్టీ పెద్దలు రంగంలోకి దింపినట్లు సమాచారం. అయితే ఇప్పటికే అనంతపురం త్రీటౌన్ పోలీసులు సైతం లలీంద్రను కిడ్నాప్ చేసింది వాస్తవమేనని తేల్చేశారు. స్థానికంగా లభించిన సీసీ ఫుటేజీల ఆధారంగా, బాధిత వర్గంలోని ప్రత్యక్షసాక్షి తిప్పేనాయక్ ఫిర్యాదుతో కేసు కూడా నమోదు చేశారు.

అనంతకు చేరుకున్న కర్ణాటక పోలీసులు..

కిడ్నాప్‌కు గురైన లలీంద్ర కుటుంబసభ్యులు కర్ణాటకలోని పురితిప్పల్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సమాచారం. దీంతో కర్ణాటక పోలీసులు కూడా ఈ కేసును ఛేదించేందుకు అనంతకు చేరుకున్నారు. స్థానిక పోలీసుల సహకారంతో ఘటనా స్థలానికి చేరుకున్న వారు సమీప ప్రాంతాల్లోని సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించి, తమకు కావాల్సిన ఆధారాలను సేకరించుకున్నారు. శనివారం సాయంత్రం అనంతకు చేరుకున్న రాయచూరు పోలీసులు ఆదివారం ఉదయం నుంచి కిడ్నాపర్ల కోసం వేట ప్రారంభించారు.

సాయిబాబా ఆలయంలో చోరీ

బొమ్మనహాళ్: మండలంలోని ఉద్దేహాళ్ శివారులోని వేదావతి హగరి నది ఒడ్డున ఉన్న షిర్డీ సాయిబాబా ఆలయంలో శనివారం రాత్రి చోరీ జరిగింది. ఇదే ఆలయంలో గతంలో రెండు సార్లు దొంగలు చొరబడి హుండీలోని కానుకలను అపహరించుకెళ్లారు. తాజాగా శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత బాబా విగ్రహం పక్కన ఉన్న రెండు ఇత్తడి సింహం విగ్రహాలు, హుండీలోని నగదు, గంటలు, పెద్ద దీపాలు, బీరువా తాళం బద్ధలుగొట్టి అందులోని సామగ్రిని అపహరించుకెళ్లారు. వీటి విలువ దాదాపు రూ.75వేలకు పైగా ఉంటుంది. ఆదివారం ఉదయం ఆలయానికి వచ్చిన అర్చకులు చోరీ జరిగిన విషయాన్ని గుర్తించి సమాచారం అందించడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఆలయ నిర్వాహకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ శివ తెలిపారు.

వైఎస్సార్‌సీపీతోనే బీసీల అభ్యున్నతి

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా


మాట్లాడుతున్న పైలా నరసింహయ్య

అనంతపురం క్రైం: వైఎస్సార్‌సీపీతోనే బీసీల అభ్యున్నతి సాధ్యపడిందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య అన్నారు. గతంలో ఎన్నడూ లేనిది ఇటీవల బీసీలపై జనసేన అధినేత పవన్ కళ్యాణ్, టీడీపీ నారా లోకేష్‌కు ప్రేమ పుట్టుకొచ్చిందని ఎద్దేవా చేశారు. జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ చరిత్రలో ఏ రాష్ట్రంలోనూ విధంగా రాజ్యాధికారంలో బీసీలకు సముచిత స్థానం కల్పించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. ఊహకందని విధంగా బీసీలకే రాజ్యసభ టికెట్లు కేటాయించి చరిత్ర సృష్టించారన్నారు. మంత్రి వర్గంలోనూ, ఎమ్మెల్యేలు, నామినేటెడ్ పదవుల్లోనూ బీసీలకు సముచిత స్థానం కల్పించి భావి తరాలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదర్శంగా నిలిచారన్నారు. ప్రభుత్వం ఏర్పాటైన అతి తక్కువ కాలంలోనే విప్లవాత్మక సంస్కరణలతో 139 బీసీ కులాలకు న్యాయం చేశారన్నారు. బీసీ అధ్యయన కమిటీ ద్వారా బీసీ సమస్యలను గుర్తించడంతో పాటు వాటి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారన్నారు. బీసీ డిక్లరేషన్ అమలు, కమిషన్ ఏర్పాటు, రిజర్వేషన్ అమలుకు పార్లమెంట్‌లో ప్రైవేట్ బిల్లును ప్రవేశపెట్టిన విషయాన్ని గుర్తు చేశారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో టీడీపీ, జనసేన బీసీల మంత్రం జపిస్తూ మోసం చేసేందుకు సిద్ధమయ్యాయన్నారు. వీరెన్ని కుట్రలు చేసినా ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. రానున్న ఎన్నికల్లో బీసీలందరూ సీఎం వైఎస్ జగన్ పక్షాన నిలుస్తారన్నారు.

కుస్తీ పోటీల్లో 'అనంత'కు రన్నరప్

- మొదటి స్థానంలో తిరుపతి
- తృతీయ స్థానంలో అనకాపల్లి, విశాఖ జిల్లాలు


అనంతపురం క్రీడాకారులతో జాతీయ గ్రాప్లింగ్ అసోసియేషన్ చైర్మన్ దినేష్‌కుమార్

అనకాపల్లి టౌన్: విద్యార్థి దశ నుంచి క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని జాతీయ గ్రాప్లింగ్ (కుస్తీ) అసోసియేషన్ చైర్మన్ దినేష్‌కుపూర్ అన్నారు. స్థానిక గవరపాలెం రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియంలో రాష్ట్ర స్థాయి మూడో సబ్ జూనియర్ గ్రాప్లింగ్ పోటీల ముగింపు కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్రీడలపై ప్రత్యేక దృష్టి సారించాయన్నారు. విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. జాతీయ స్థాయిలో ప్రతిభ చాటిన క్రీడాకారులకు స్పోర్ట్స్ కోటాల్లో ప్రభుత్వ ఉద్యోగాలు దక్కుతాయన్నారు. కాగా, ఈ పోటీలకు రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాలకు చెందిన 600 మంది క్రీడాకారులు హాజరయ్యారు. పోటీల్లో తిరుపతి జిల్లా ప్రథమ స్థానం, అనంతపురం జిల్లా ద్వితీయ, అనకాపల్లి, విశాఖ జిల్లాలు తృతీయ స్థానం సాధించాయి. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఏపీ ఒలింపిక్ అసోసియేషన్ మాజీ ఉపాధ్యక్షుడు పద్మనాభం, సీనియర్ క్రీడాకారులు లక్ష్మణరావు, కె.ఎస్.వి.సత్యనారాయణ, గ్రాప్లింగ్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సురేందర్‌రెడ్డి, పోటీల ఆర్గనైజింగ్ కార్యదర్శి టి.జ్యోతిర్మయి, క్రీడాకారులు పాల్గొన్నారు.

నైతిక విలువలు పెంపొందించడమే లక్ష్యం

- ఏపీ ఎండోమెంట్ సలహాదారు జ్వాలాపురం శ్రీకాంత్


సన్మానం అందుకుంటున్న జ్వాలాపురం శ్రీకాంత్

అనంతపురం కల్చరల్: సంస్కృతీ సంప్రదాయాలు మరుగున పడిపోకుండా చిన్నారుల్లో నైతిక విలువలు పెంపొందించడమే లక్ష్యంగా టీటీడీ ధర్మప్రచార పరిషత్తు కార్యక్రమాలు నిర్వహిస్తోందని ఏపీ ఎండోమెంట్ సలహాదారు జ్వాలాపురం శ్రీకాంత్ తెలిపారు. ఆదివారం స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో 'కథ చెపుతారా ఊ కొడదాం' పేరుతో చిన్నారులకు కథల పోటీలు జరిగాయి. అనంతరం జరిగిన బహుమతుల ప్రదానోత్సవంలో జ్వాలాపురం శ్రీకాంత్ మాట్లాడారు. హైందవ ధర్మప్రచారం కోసం టీటీడీ విస్తృతంగా పని చేస్తోందన్నారు. ఆలయాల్లో అనేక సంస్కరణలు వస్తున్నాయని, భక్తిభావం పెంపొందించడంపై ఆనందంగా ఉందన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చిన్నారులకు చక్కటి సంస్కారాన్ని నేర్పాలన్నారు. గవిమఠం పీఠాధిపతి కరిబసవ రాజేంద్రస్వామితో కలిసి విజేతలకు బహుమతులు అందించారు. అంతకుముందు కీలుగుర్రాలు, నృత్యాలతో కళాకారులు ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో న్యాయ నిర్ణేతలుగా సంధ్యావందనం రామచంద్రరావు, శర్మ, నాగేశ్వరరెడ్డి, డాక్టర్ సుధాకర్, టీటీడీ సిబ్బంది బాబు, వేణు, సుధామణి, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

స్పెయిన్ కోచ్‌ల బాస్కెట్ బాల్ శిక్షణ


స్పెయిన్ కోచ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

అనంతపురం: జిల్లాలోని వివిధ కేంద్రాల్లో ఈ నెల 17 నుంచి 30వ తేదీ వరకు స్పెయిన్ కోచ్‌లతో బాస్కెట్‌బాల్ కోచింగ్ క్యాంప్ నిర్వహించారు. ఆదివారం 12 ఏళ్లలోపు మిక్స్‌డ్ జెండర్ , 16 ఏళ్లలోపు బాలబాలికల ఒక రోజు టోర్నమెంట్ నిర్వహించారు. కోచింగ్ క్యాంప్ ముగింపు వేడుకలను అశోక్‌నగర్‌లోని ఇండోర్ స్టేడియంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్పెయిన్ కోచ్‌లందరినీ సన్మానించారు. ముఖ్య అతిథులుగా క్రీడాపాఠశాల, వైఎస్సార్ కడప జిల్లా ముఖ్య అధికారి జగన్నాథ రెడ్డి, ఏడీబీఏ అధ్యక్షుడు , కార్యదర్శి కేఎం హబీబుల్లా, కే నరేంద్ర చౌదరి, ఏడీబీఏ సభ్యులు, సీనియర్ ఫిజికల్ డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

అందరి సహకారంతోనే సంఘం అభివృద్ధి

- ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణసేవాసంఘ సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్‌శర్మ

హిందూపురం: బ్రాహ్మణ కుటుంబ సభ్యులందరి సహకారంతోనే సంఘం అభివృద్ధి సాధ్యమవుతుందని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణసేవాసంఘ సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సతీష్‌శర్మ అన్నారు. హిందూపురంలోని నానెప్పనగర్ గాయత్రీ ఆలయ కల్యాణ మంటపంలో కల్లూరు ఆదినారాయణరావు అధ్యక్షతన ఆదివారం జిల్లా బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సతీష్ శర్మ మాట్లాడుతూ... ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లోనూ బ్రాహ్మణులు రాణించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఐక్యతతో దేనినైనా సాధించుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో సమాఖ్య రాష్ట్ర ప్రతినిధులు ప్రసాదరావు, రాఘవేంద్రరావు, లక్ష్మణరావు, నాగేశ్వరరావు, రాష్ట్ర మహిళా సంఘం ప్రతినిధులు పార్వతమ్మ, గాయత్రి, సంధ్య, సమాఖ్య సభ్యులు పాండురంగరావు, సోమశేఖర్‌శాస్త్రి, పద్మనాభరావు, నాగరాజరావు, మంజునాథ్ తదతరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఇదే: జిల్లా సమాఖ్య అధ్యక్షుడిగా దేశాయి మురళి, ప్రధాన కార్యదర్శిగా టి.ఎస్. ప్రవీణ్ కుమార్, ఉపాధ్యక్షులుగా డి.ఎ.రామ్మూర్తి, ఎం.శ్రీనివాస్, కోశాధికారిగా కల్లూరి మల్లికార్జునరావు, సహాయ కార్యదర్శులుగా నంజుండరావు, వెంకటేష్, మారుతీరావు, సత్యనారాయణరావు, కార్యవర్గ సభ్యులుగా సోమశేఖర్, నాగరాజరావు, సతీష్, రాజేంద్రప్రసాద్, బద్రీనాథ్, హర్షవర్ధన్, శ్రీనివాసమూర్తి తదితరులు ప్రమాణస్వీకారం చేశారు.

జేసీ సోదరుల వైఖరితో

విసుగు చెందే టీడీపీకి రాజీనామా

- రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి అయూబ్ బాషా


విలేకరులతో మాట్లాడుతున్న అయూబ్‌బాషా

అనంతపురం టవర్‌క్లాక్: తాడిపత్రిలో జేసీ సోదరుల ఆగడాలు మితిమీరిపోతున్నాయని, వారి వైఖరితో విసుగు చెంది తాను టీడీపీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి అయూబ్ బాషా అన్నారు. ఆదివారం అనంతపురంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తన వర్గీయులతో కలసి ఆయన మాట్లాడారు. 1996 నుంచి టీడీపీలో కొనసాగుతున్నట్లు గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు జేసీ సోదరుల అరాచకాలకు ఎదురొడ్డి టీడీపీ బలోపేతానికి తాను పడిన శ్రమను వివరించారు. ఎన్నో తప్పుడు కేసులు బనాయించి, ఆర్థిక మూలాలను అప్పట్లో జేసీ సోదరులు దెబ్బతీశారన్నారు. వారు టీడీపీలో చేరుతున్నప్పుడు తాము వద్దని విన్నవించినా అధిష్టానం పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. 2019 ఎన్నికల్లో జేసీ సోదరుల గెలుపు కోసం శక్తివంచన లేకుండా కృషి చేశామన్నారు. రాష్ట్రంలో ఏ జిల్లాలోనూ లేనివిధంగా తాడిపత్రి మున్సిపాలిటీని టీడీపీ కైవసం చేసేందుకు తామంతా శక్తివంచన లేకుండా కృషి చేశామన్నారు. పార్టీ అభ్యున్నతికి తాము పడిన శ్రమనంతా వృథా చేస్తూ జేసీ సోదరులు తమను అణచి వేసేందుకు కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. దీంతో విసుగు చెంది పార్టీ సభ్యత్వానికి, పదవులకు రాజీనామా చేస్తున్నానన్నారు.

అపూర్వ సమ్మేళనం


పూర్వవిద్యార్థులతో ఆనాటి ఉపాధ్యాయులు

యాడికి: మండలంలోని రాయలచెరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వారంతా 27 ఏళ్ల క్రితం కలిసి చదివారు. అనంతరం ఉన్నత చదువుల కోసం విడిపోయారు. విద్యాభ్యాసం తర్వాత ఉద్యోగాలు, జీవన ప్రయాణంలో ఏళ్లు గడిచిపోయాయి. ఈ క్రమంలో తమ బాల్య మిత్రులను ఎలాగైనా కలుసుకోవాలనే కోరిక కలిగింది. 1995–96 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం వేడుకగా సాగింది. ఎక్కడెక్కడో స్థిరపడిన వారందరూ తరలిరావడంతో సందడి వాతావరణం నెలకొంది. ఆత్మీయ పలకరింపులతో మురిసిపోయారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు జయదీవెన, నాగరాజుశర్మ, ఓబులేసు, రవికుమార్ రెడ్డి, సుబ్రహ్మణ్యం, రమేష్, లక్ష్మీదేవిని ఘనంగా సత్కరించారు. అనంతరం గ్రామాభివృద్ధికి పాటు పడుతున్న పారిశుద్ధ్య కార్మికులు, విలేకరులు, లయన్స్‌క్లబ్ సభ్యులు, రక్తదాన నిర్వాహకులు, అనాథ శవాల దహన సంస్కార నిర్వాహకులను జ్ఞాపికలు అందజేసి సన్మానించారు. అంతకు ముందు ఇటీవల ఎస్కేయూ నుంచి డాక్టరేట్ అందుకున్న సాకే భారతి, ఆమె కుటుంబసభ్యులను సత్కరించారు. కార్యక్రమానికి పూర్వ విద్యార్థులు శంకరయ్య, సుబహాన్, జగన్‌మోహన్ నాయుడు, శ్రీకృష్ణ, ప్రసాద్, సెక్షావలి, శారద, సుజాత, సరస్వతి, దీనరాణి, రాధ, అనితకుమారి తదితరులు నేతృత్వం వహించారు.

'1104' ప్యానెల్ విజయం


సంబరాలు చేసుకుంటున్న విజేతలు

అనంతపురం టౌన్: ఉమ్మడి జిల్లా విద్యుత్ శాఖ ఉద్యోగుల కో–ఆపరేటివ్ సొసైటీ ఎన్నికల్లో 1104, 327 యూనియన్ల సంయుక్త ప్యానెల్ విజయం సాధించింది. ఆదివారం అనంతపురంలోని రాజేంద్ర నగర పాలక ఉన్నత పాఠశాల వేదికగా సాగిన పోలింగ్ ప్రక్రియలో 1,500 మందికి పైగా సభ్యులు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఎస్సీ, ఎస్టీ, ఇంజనీర్ల సంఘం ప్యానెల్‌తో పాటు 1104, 327 సంఘాల సంయుక్త ప్యానెల్ తలపడ్డాయి. ఫలితాలను ఎన్నికల అధికారిగా రోషన్ వెల్లడించారు. 150 పైచిలుకు ఓట్లతో 1104, 327 యూనియన్ల సంయుక్త ప్యానెల్‌లోని 11 మంది డైరెక్టర్ల స్థానాలను కై వశం చేసుకున్నారు. ఆగస్టు 2న సొసైటీ అధ్యక్షుడిని ఎన్నుకోనున్నారు.

క్లుప్తంగా

సంతల ఆదాయం రూ.2.61లక్షలు

అనంతపురం అగ్రికల్చర్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డుల ఈ వారం జరిగిన పశువులు, జీవాల సంతల ద్వారా రూ.2.61 లలకు పైగా ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. అందుల శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంతలో రూ.1,32,235 వసూలు కాగా, ఆదివారం జరిగిన పశువుల సంత ద్వారా రూ.1,28,840 మేర వసూలు అయినట్లు తెలిపారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

ఆత్మకూరు: పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామిని మంగళస్నానాలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామి వారి మూలవిరాట్‌కు ప్రత్యేకంగా పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలు ధరింపజేశారు. ఆలయ ప్రాంగణంలో కుజదోష, సర్పదోష నివారణకు రాహుకేతు హోమాలు నిర్వహించారు. మంజునాథస్వామి, పార్వతిదేవికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు.అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

రైతుకు ఆర్థిక సాయం



రైతుకు ఆర్థికసాయం చేసిన వైఎస్సార్ సీపీ నాయకులు

రాప్తాడు: మండల కేంద్రంలోని రైతు బోగిరిన పోతులయ్యకు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి రూ.20 వేలు ఆర్థిక సాయం అందించారు. రైతు బోగిని పోతులయ్య తన వ్యవసాయ తోటలో బోరుబావి తవ్వించుకొని, మోటారు కోసం ఎమ్మెల్యేను ఆర్థికసాయం కోసం విన్నవించాడు. స్పందించిన ఎమ్మెల్యే.. నియోజకవర్గ బూత్ కమిటీ అధ్యక్షుడు హరినాథ్ రెడ్డి ద్వారా రూ.20 వేలు అందించాడు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల పోరాట కమిటీ చైర్మన్ సుదర్శన్‌రెడ్డి

అనంతపురం అర్బన్: విద్యుత్ సంస్థల్లోని ఉద్యోగులు, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ద్యుత్ ఉద్యోగుల పోరాట కమిటీ రాష్ట్ర చైర్మన్ సుదర్శన్‌రెడ్డి కోరారు. ఆదివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశానికి ఆయనతో పాటు కమిటీ కన్వీనర్ రామలింగారెడ్డి పాల్గొని మాట్లాడారు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులు, ఎనర్జీ అసిస్టెంట్లను రెగ్యులరైజ్ చేయాలన్నారు. వేతన సవరణలో ఉద్యోగులందరికీ ఒకే మాస్టర్ స్కేల్ ఏర్పాటు చేసి, స్పెషల్ పే లేదా పర్సనల్ పే ద్వారా వేతనం తగ్గించకుండా అమలు చేయాలన్నారు. పాత పెన్షన్ విధానం అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శులు నూర్ మహమ్మద్, రాజారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్, అధ్యక్షురాలు నాగమణి, నాయకులు రామచంద్ర, రమాదేవి, జిలాని, పాలొన్నారు.

అరంగేట్రంతోనే అద్భుత ప్రదర్శన



అరంగేట్రంలో చిన్నారుల అభినయం

అనంతపురం కల్చరల్: శ్రీనృత్యకళానిలయం సంధ్యామూర్తి శిష్యబృందం ఆదివారం రాత్రి అరంగేట్రంతోనే అద్భుత అభినయంతో ఆకట్టుకున్నారు. ఆదివారం రాత్రి శారదానగర్‌లోని శ్రీ శృంగేరీ శంకరమఠంలో రంగపూజ చేశారు. అన్నమయ్య, త్యాగయ్య, పురందర దాస సంకీర్తనలపై చిన్నారులు చేసిన శాస్త్రీయ నృత్యాలు అలరించాయి. ఆత్మీయ అతిథులు ఏపీ ఎండోమెంటు సలహాదారు జ్వాలాపురం శ్రీకాంత్, మఠం మేనేజర్ సత్యప్రసాద్, డాక్టర్ సుధాకరబాబు, బ్రాహ్మణ సంఘం నాయకులు శ్రీనిధి రఘు మాట్లాడారు. అనంతరం చిన్నారులు లక్ష్మీ, కీర్తన, మోక్షిత హిమబిందు, అమేయ, తాత్వికసాయి, లాస్యప్రియ, తమోఘ్న, ప్రీతి, కేతన, దివిజ, లాసిన, చంద్రలేఖకు జ్ఞాపికలు అందించారు.

ఘనంగా మొహర్రం వేడుకలు

రాప్తాదురూరల్: అనంతపురం రూరల్ మండలంలోని వివిధ గ్రామాల్లో మొహర్రం వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. మతసామరస్యానికి ప్రతీక అయిన ఈ మొహర్రం పండుగను హిందూ ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. అగ్నిగుండం కాల్చి, మొక్కులు తీర్చుకున్నారు. కురుగుంట, కృష్ణంరెడ్డిపల్లి గ్రామాల్లో పీర్లను ప్రత్యేకంగా అలంకరించి, ఊరేగించారు. ఈ సందర్భంగా పీర్ల వద్ద చెక్కెర చదివింపులు చేశారు. పీర్ల ఊరేగింపు కార్యక్రమం వైభవంగా జరిగింది. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. సాయంత్రం పీర్లు జలధికి తరలి వెళ్లాయి.

ఆత్మకూరు: మొహర్రం వేడుకలు మండలంలోని పలు గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆదివారం మండలంలోని తలుపూరు, సనప, తోపుదుర్తి గ్రామాల్లో పీర్లను జలధికి తీసుకెళ్లారు. గ్రామాల్లోని ప్రజలు పీర్ల స్వాములకు చెక్కెర చదివింపులు చేయించారు.

కనగానపల్లి: మండలంలోని కోనాపురం, కొండపల్లి



ఎం.బండమీదపల్లిలో జలధికి వెళ్తున్న పీర్లు

గ్రామాల్లో ఆదివారం మొహర్రం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా చివరి రోజు నిర్వహించిన జలధి కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీర్ల స్వాములను అగ్నిగుండ ప్రవేశం చేయించి, భక్తుల కోలాహలం మధ్య జలధికి తరలించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ఘర్షణలు తలెత్తకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

రామగిరి: మండలంలోని మాదాపురం, గంగంపల్లి గ్రామాల్లో ఆదివారం జలధి వేడుకలను గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముందుగా తెల్లవారుజాము నుంచి ఉదయం వరకు ఆయా గ్రామాల్లో ఊరేగింపు నిర్వహించారు. అగ్నిగుండ ప్రవేశం అనంతరం పీర్లను జలధికి తరలించారు.

నాలుగు గ్రామాల్లో ముగిసిన జలధి

రాప్తాడు: మండలంలోని ఎం.బండమీదపల్లి, బోగినేపల్లి, పాలబావి, మరూరు గ్రామాల్లో ఆదివారం మొహర్రం వేడుకలు ముగిశాయి. జలధి వేడుకలను గ్రామాల్లో హిందూముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పెద్దసరిగెత్తు సందర్భంగా స్థానిక పీర్లమకానంలో పీర్లకు ప్రత్యేకంగా పూజలు చేశారు. ఆదివారం ఉదయం 7 గంటలకు పీర్లను గుండంలోకి దింపారు. సాయంత్రం 3 గంటల నుంచి 6 గంటల వరకు పీర్ల దేవుళ్లను భక్తి శ్రద్ధలతో ఊరేగించి, జలధికి తీసుకెళ్లారు. భక్తులు మొక్కుబడుల రూపంలో బెల్లపు ఉంటలను పీర్లపైకి విసిరారు.



రాప్తాడు మండలం బండమీదపల్లిలో పీర్ల ముందు చిందులు తొక్కుతున్న యువకులు



ఆత్మకూరు మండలం తలుపూరులో జలధికి వెళ్తున్న పీర్లు



కురుగుంటలో పీర్ల ఊరేగింపులో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు

గణితంలో మెలకువలు తప్పనిసరి

రాప్తాదురూరల్: 'రోజూ ఒక సమస్యను నేర్చుకోండి' అనే కార్యక్రమంలో భాగంగా ప్రతి విద్యార్థీ ఒక సమస్య సాధించడానికి అవసరమైన మెలకువలను గణిత ఉపాధ్యాయులు నేర్పించాలని గణిత ఫోరం ప్రతినిధులు సూచించారు. ఆదివారం నగరంలోని ఉపాధ్యాయ భవనంలో గణిత ఫోరం జిల్లా సర్వసభ్య సమావేశం జరిగింది. గణిత ఉపాధ్యాయుల అవసరాలు, 10 వ తరగతి విద్యార్థులు గణితంలో 100 శాతం ఉత్తీర్ణత సాధించడానికి అనుసరించాల్సిన మార్గాలు, గణిత ఉపాధ్యాయులు ఐఎఫ్‌పీ ప్యానల్ ఉపయోగించడానికి శిక్షణ, 10వ తరగతి సీ,డీ గ్రేడ్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్, నమూనా పాఠ్య ప్రణాళికలు, గణిత ఉపాధ్యాయులకు పని భారం తదితర అంశాలను చర్చించారు. ఆంధ్ర ప్రదేశ్ గణిత ఫోరం జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ , ప్రధాన కార్యదర్శి శివప్రసాద్, గౌరవ అధ్యక్షుడు ఎస్. రమణారెడ్డి, గౌరవ సలహాదారులు ఈశ్వరయ్య, కార్యవర్గ సభ్యులు చాంద్‌బాషా, ఆనంద భాస్కర్ రెడ్డి, చంద్రశేఖర్ , జయరామ్‌నాయక్, నరేంద్రనాథ్ గౌడ్, చంద్ర శేఖర్ స్వామి, రవీంద్రనాథ్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గణిత ఫోరం సభ్యుడు

మణిపూర్ మారణకాండపై శాంతి ర్యాలీ



శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న వామపక్షపార్టీల నాయకులు

అనంతపురం టవర్‌క్లాక్: మణిపూర్‌లో జరుగుతున్న మారణకాండపై నగరంలో వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఆదివారం శాంతిర్యాలీ చేశారు. ర్యాలీలో సీపీఐ, సీపీఎం, వామపక్ష పార్టీల నాయకులు పాల్గొన్నారు. మొదట అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. అనంతరం అక్కడి నుంచి సప్తగిరి సర్కిల్ మీదుగా టవర్‌క్లాక్ వరకూ శాంతి ర్యాలీ కొనసాగింది. సీపీఐ నాయకుడు జగదీష్ మాట్లాడుతూ మణిపూర్‌లో మారణకాండను కేంద్ర ప్రభుత్వం నియంత్రించలేకపోతోందన్నారు. మణిపూర్ రాష్ట్రంలో ప్రభుత్వ అండదండలతోనే కుకీలపై దాడులు చేస్తున్నారన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ మాట్లాడుతూ మణిపూర్‌లో జరుగుతున్న మారణకాండ భారతదేశం తలదించుకునేలా ఉందన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కేశవరెడ్డి, నాయకులు రమణ, జాన్సన్ బాబు, రాజేష్ గౌడ్, పద్మావతి, పార్వతి, దాదాగాంధీ, ఇండ్ల ప్రభాకర్‌రెడ్డి, అబ్దుల్ రసూల్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి అండర్-15 చెస్ పోటీలు

అనంతపురం: నగరంలోని శ్రీవిద్యానికేతన్ పాఠశాలలో ఆల్ అనంతపురం చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి అండర్ -15 ఓపెన్ చెస్ ఛాంపియన్‌షిప్ -2023 పోటీలను ఆదివారం నిర్వహించారు. స్విస్ లీగ్ పద్ధతిలో మొత్తం ఆరు రౌండ్లు పోటీలు నిర్వహించినట్లు చీఫ్ ఆర్బిటర్ గౌతమి తెలిపారు. ఇందులో ప్రథమ స్థానం శామ్యూల్ స్టీఫెన్ నోబుల్ 6/6 పాయింట్లు, ద్వితీయ స్థానం సహ్యాద్ ఎంపీ 5.5/6 పాయింట్లు, తృతీయ స్థానం రోహిత్ జే 4.5/6 పాయింట్లు, నాలుగో స్థానం కృష్ణ సుదీంద్ర వెంకటసముద్రాల 4.5/6 పాయింట్లు, ఐదో స్థానం రామ్‌సాయి కే 4.5/6 పాయింట్లు, ఆరో స్థానం కాశి నామిక 4.5/6 పాయింట్లు సాధించారు. ఇందులో టాప్-4 క్రీడాకారులు ఆగస్టు 24 నుంచి 27 వరకు అనంతపురంలోని కేఎస్ఎన్ మహిళా డిగ్రీ , పీజీ కళాశాలలో ఏ1 చెస్ అకాడమీ, ఆల్ అనంతపురం చెస్ అసోసియేషన్, అఖిల భారత చదరంగం సమాఖ్య ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి అండర్ -15 ఓపెన్ ఫిడే రేటింగ్ చెస్ ఛాంపియన్‌షిప్ -2023 పోటీలు జరుగుతాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి అండర్ 15 విభాగంలో ప్రతిభ చాటిన క్రీడాకారులకు రూ.30 వేలు నగదు బహుమతులు ఇస్తారు. ఇందులో ప్రతిభ చాటే నలుగురు క్రీడాకారులకు జాతీయ స్థాయి అండర్-15 ఓపెన్ చెస్ ఛాంపియన్‌షిప్-2023 పోటీలు నిర్వహిస్తారు. కార్యక్రమంలో ఆల్ అనంతపురం చెస్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి అమ్మినేని ఉదయ్‌కుమార్ నాయుడు, టోర్నమెంట్ కోఆర్డినేటర్ గోవిందరాజులు పాల్గొన్నారు. పూర్తి వివరాలు www.apchess.org వెబ్‌సైట్‌లోగానీ, సెల్: 9701076386, 7893878177లోగానీ తెలుసుకోవచ్చు.



చెస్ పోటీల్లో పతకాలు దక్కించుకున్న క్రీడాకారులు

ఓటరు జాబితా సవరణకు ప్రత్యేక డ్రైవ్



ఓటరు జాబితా సవరణను పరిశీలిస్తున్న నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ రమణారెడ్డి, ఈడీటీ దివాకర్‌రావు

అనంతపురం అర్బన్: అనంతపురం అర్బన్ నియోజకవర్గం పరిధిలో ఓటరు జాబితా సవరణకు ఆదివారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. బీఎల్‌ఓలు వివిధ పోలింగ్ కేంద్రాల పరిధిలో చేపట్టిన ఇంటింటా సర్వేను నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ రమణారెడ్డి, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ దివాకర్ రావు పరిశీలించారు. బీఎల్‌ఓలకు వారు తగిన సూచనలిచ్చారు. సవరణలో ప్రతి ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలు తెలుసుకొని మార్పులు -చేర్పులు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఏ యోగి, సూపర్‌వైజర్లు శ్రీనివాసులు, కుళ్లాయప్ప, దామోదర్, రామలింగ, కుద్దూస్ పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణానికి దరఖాస్తు చేసుకోండి

అనంతపురం క్రైం: సొంత స్థలం ఉన్నవారు ఇంటి నిర్మాణానికి దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం సహకారం అందిస్తుందన్నారు. నగర పాలక సంస్థలోని హౌసింగ్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తు చేసుకునేందుకు సోమవారం చివరితేదీ అని, అర్హులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

- టింబక్టు కలెక్టివ్ చైర్‌పర్సన్ మేరీ

రామగిరి: మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించాలని టింబక్టు కలెక్టివ్ చైర్‌పర్సన్ మేరి అన్నారు. మండల కేంద్రంలోని ప్రముఖ స్వచ్ఛంద సంస్థ టింబక్టు కలెక్టివ్ సంస్థ సహకారంతో మహిళాశక్తి సొసైటీ 21వ వార్షిక మహాసభ ఆదివారం ఘనంగా నిర్వహించారు. సంస్థ చైర్‌పర్సన్ మేరీ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందుకు రావాలని, ఆర్థికంగా బలపడితే సామాజికంగా సమానత్వం పొందొచ్చన్నారు. సంస్థ ఆధ్వర్యంలో మహిళా సాధికారత కోసం చేపట్టిన పొదుపు, ఖర్చుల వివరాలు వెల్లడించారు. ముందుగా చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో సంస్థ సిబ్బంది అశ్విని, సుకన్య, రమ్య, గౌరి, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



మహిళాశక్తి సొసైటీ సమావేశంలో మాట్లాడుతున్న సంస్థ ప్రతినిధులు

మహిళల ఆర్థికాభివృద్ధితోనే దేశాభివృద్ధి

అనంతపురం కల్చరల్: మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందితేనే దేశాభివృద్ధి సాధ్యమని పలువురు వక్తలు అన్నారు. ఆదివారం స్థానిక షిర్డీనగర్‌లోని వివేకానంద యోగా భవన్‌లో నారీ సమ్మేళనం జరిగింది. వివిధ రంగాలకు చెందిన మహిళలు నారీశక్తి బ్రోచర్లను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ మహిళల అభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యం అనే నినాదంతో అన్ని రంగాల్లో మహిళలను భాగస్వామ్యం చేస్తామన్నారు. నారీశక్తి సమ్మేళనానికి ఎంపికైన సంస్కార భారతి జిల్లా ప్రతినిధి లక్ష్మి, న్యాయవాది పద్మజ, వాసవీ మహిళా మండలి మాజీ అధ్యక్షురాలు పద్మలత, నారీ సమ్మేళనం నిర్వాహక కమిటీ సభ్యులు హేమంతి, , ప్రభావతి, కల్యాణి, ఉత్తమ ఉపాధ్యాయురాలు పురస్కార గ్రహీత శ్రీదేవి, రమామణి తదితరులు నారీ సమ్మేళనంలో ఆత్మీయ అతిథులుగా హాజరై మాట్లాడారు.



బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

ప్రశాంత వాతావరణం కల్పించండి

అనంతపురం శ్రీకంఠం సర్కిల్: మొహర్రం వేడుకల్లో ప్రశాంత వాతావరణం కల్పించాలని, ఎక్కడైనా అవాంఛనీయ ఘటనలు జరిగితే చర్యలు తప్పవని సీఐ రెడ్డప్ప హెచ్చరించారు. కంబదూరులో జరిగిన మొహర్రం వేడుకల్లో అల్లరి మూకలు చేసిన రాద్ధాంతంపై ఎస్పీ సీరియస్ అయ్యారు. దీంతో అనంతపురం వన్‌టౌన్ పోలీసులు రౌడీ షీటర్లను స్టేషన్‌కు పిలిపించారు. సీఐ రెడ్డప్ప వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. పోలీసుల హెచ్చరికలను బేఖాతరు చేస్తే తోలు తీస్తానని హెచ్చరించారు. మొహర్రం వేడుకలను కులమతాలకతీతంగా ప్రతి ఒక్కరూ జరుపుకోవాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పరస్పరం సోదరభావంతో జరుపుకోవాలన్నారు. ఇప్పటికే అల్లరిమూకల వివరాలు సేకరించామని తెలిపారు. పీర్ల మంటపాలను ఏర్పాటు చేసిన కమిటీ సభ్యులు కూడా బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ఎక్కడైనా ప్రశాంతతకు భంగం కలిగించినట్లయితే 100 డయల్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు.



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ రెడ్డప్ప

వాహనాలు వేగంగా నడిపితే కఠిన చర్యలు

బుక్కరాయసముద్రం: వాహనదారులు వాహనాలను వేగంగా నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ నాగార్జునరెడ్డి హెచ్చరించారు. ఆదివారం మండల కేంద్రంలోని అనంతపురం- తాడిపత్రి రహదారిపై వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ వాహనదారులు వేగంగా వాహనాలను నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు వాహన రికార్డులు తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు. ఎస్ఐ వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పారదర్శకంగా ఓటర్ల సర్వే చేయండి

రామగిరి: ఓటరు జాబితాలో వివరాలపై పారదర్శకంగా సర్వే చేయాలని తహసీల్దార్ నారాయణస్వామి పేర్కొన్నారు. ఆదివారం పేరూరులో కొత్త ఓటరు జాబితా పరిశీలనను బీఎల్‌ఓలతో కలిసి ఆయన ఇంటింటికీ వెళ్లి పరిశీలించారు. ఓటర్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన జాబితాను పూర్తి చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ నరసింహమూర్తి, వీఆర్ఓ జగదీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఎగాలా ఫౌండేషన్ శిక్షణ

అనంతపురం: స్పెయిన్‌కు చెందిన ఎగాలా ఫౌండేషన్ ఫుట్‌బాల్ కోచ్‌లు ఇచ్చిన ప్రత్యేక శిక్షణ ఆదివారం ముగిసింది. పదేళ్లుగా స్పెయిన్‌కు చెందిన ఫుట్‌బాల్ కోచ్‌లు అనంతపురం జిల్లాను సందర్శించి, ఆర్డీటీ ఆధ్వర్యంలో క్షేత్రస్థాయిలో జరుగుతున్న ఫుట్‌బాల్ శిక్షణను పరిశీలించారు. అనంతపురం క్రీడా గ్రామంలో ఫుట్‌బాల్ రెసిడెన్షియల్ శిక్షణ పొందుతున్న క్రీడాకారులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. అండర్-11, అండర్-13, అండర్-17 బాల, బాలికలకు శిక్షణ ఇవ్వడం ఎంతో ఆనందంగా ఉందని స్పెయిన్ ఫుట్‌బాల్ కోచ్‌లు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ , అనంతపురం జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.వేణుగోపాల్, జాయింట్ సెక్రటరీ ఈరన్నగౌడ్, ఎగాలా ఫౌండేషన్ ప్రెసిడెంట్ జౌమ్ గార్సియా, ఆర్డీటీ కోచ్ దాదా ఖలందర్ తదితరులను ఆర్డీటీ ప్రతినిధులు సత్కరించారు.



స్పెయిన్ ఫుట్‌బాల్ కోచ్‌లకు సన్మానం చేస్తున్న దృశ్యం

52,570 మందికి ధ్రువీకరణ పత్రాలు

- నగరంలో జగనన్న సురక్ష విజయవంతం
- ప్రతి ఇంటా సమస్యల పరిష్కారం

అనంతపురం క్రైం: అర్హులందరికీ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం నగరంలో విజయవంతంగా ముగిసింది. నగరపాలక సంస్థ పరిధిలోని 50 డివిజన్లలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, జేసీఎస్ కన్వీనర్లు, గృహ సారథులు, కార్పొరేటర్లు ఇంటింటికీ వెళ్లి వివిధ రకాల సమస్యలను గుర్తించారు. ఈ నెల 1 నుంచి 28 వరకు నగరంలోని వివిధ సచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం విజయవంతమైంది. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అడ్డంకులు తొలిగాయి. ప్రతి ఇంటా ప్రభుత్వం అందిస్తున్న 11 రకాల ఉచిత సేవలపై ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. నగరంలోని వివిధ సచివాలయాల పరిధిలో మొత్తం 52,570 అభ్యర్థనలను సిబ్బంది అప్‌లోడ్ చేశారు. కుల ధ్రువీకరణ పత్రం (ఇంటిగ్రేటెడ్) 25915, ఆదాయ 24046, ఫ్యామిలీ మెంబర్ 77, మొబైల్ నంబర్ అప్‌డేషన్ ఆధార్ 1809, కొత్త రేషన్‌కార్డు 299, హౌస్‌హోల్డ్ స్ప్లిట్- 170, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్డు 8, జనన, మరణ 221, మ్యారేజ్ 25 సర్టిఫికెట్లు మంజూరుకాగా, పెన్షన్ 2, ఇళ్లు 28 దరఖాస్తు చేశారు.



సర్టిఫికెట్లు అందిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి (ఫైల్)

ప్రభుత్వ మేలు మరువలేం



మా అత్తామామలు ఉండే కార్డులోనే నా భర్త రమేష్ ఉండేవారు. దీంతో సంక్షేమ పథకాలు వర్తించలేదు. జగనన్న సురక్ష కార్యక్రమంలో రేషన్‌కార్డు, హౌస్‌హోల్డ్ స్ప్లిట్ చేయడంతో కొత్త రేషన్‌కార్డు మంజూరైంది. ఇక నుంచి అమ్మఒడి, సొంతిళ్లకు దరఖాస్తు చేసుకునే అవకాశం వచ్చింది. ప్రభుత్వ మేలు మరువలేం.

– ప్రమీల, గంగానగర్

వారం రోజుల్లో రేషన్‌కార్డు



మా సొంతూరు బళ్లారి. నగరానికి వలస వచ్చాం. నా భర్త ఇక్కడే దుకాణంలో పనికి కుదిరాడు. పథకాలు వర్తించాలంటే రేషన్‌కార్డు అవసరమైంది. 'జగనన్న సురక్ష'లో రేషన్‌కార్డుకు దరఖాస్తు చేసుకున్నాం. వారం రోజుల్లో రేషన్‌కార్డు వచ్చింది. పథకాలు వర్తిస్తాయని చెప్పున్నారు. నా బిడ్డను బాగా చదివించుకుంటాం. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు.

– స్వాతి, ద్వారకానగర్